
గోల్కొండలో పతంగులతో శ్రీకాంత్‌చారి


మహిళామండలి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు


చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్


బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ రత్నేష్ జైస్వాల్ తదితరులు

ఉత్సాహంగా సంక్రాంతి వేడుకలు


సంక్రాంతి సంబరాల వేడుకల్లో వనం సత్తేందర్, బి.హన్మంతరావు, ఏనుగుల వినోద్‌కుమార్

అబిడ్స్: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు చాటేందుకు సంక్రాంతి సంబరాలు దోహదపడుతాయని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్తేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి ఏనుగుల వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ చంద్రజిత్ సింగ్ పేర్కొన్నారు. శనివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించినా సంక్రాంతి సంబరాలను ప్రారంభించి ప్రసంగించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజల్లో ఐక్యత భావాలను పెంచేందుకు ప్రేమానుభావాలను రెట్టింపు చేసేందుకు సంక్రాంతి సంబరాలు లాంటి వేడుకలు నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి సంబరాలతో ఐక్యత భావాలు పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలను అభినందించారు. కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

గోల్కొండలో..

గోల్కొండ: బస్తీలు, కాలనీల్లో సంక్రాంతి సందడి నెలకొని ఉంది. పతంగులు, మాంజాలను పలువురు వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచే పతంగుల పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక యువజన సంఘాల వారు పతంగుల పోటీలు నిర్వహిస్తూ యువకులను ఉత్సాహపరుస్తున్నారు. గోల్కొండలో బి.శ్రీకాంత్‌చారి ఆధ్వర్యంలో పతంగుల పోటీలు జరిగాయి.

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

చాంద్రాయణగుట్ట: సీపీఎం అనుబంధ సంస్థ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్టలోని గౌస్ నగర్‌లో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశలత, శశికళ, కవిత, సీఐటీయూ చాంద్రాయణగుట్ట కార్యదర్శి ఎస్.కిషన్‌లు బహుమతులను ప్రదానం చేశారు.

విజయనగర్‌కాలనీ మహిళామండలి ఆధ్వర్యంలో..

విజయనగర్‌కాలనీ: అందమైన రంగవల్లికలతో శనివారం విజయనగర్‌కాలనీ మహిళా మండలి వీధి శోభిల్లింది. విజయనగర్‌కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళామండలి ప్రతినిధులు మాట్లాడుతూ..మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు మహిళా మండలి కృషి చేస్తుందన్నారు. మహిళామండలి అధ్యక్ష కార్యదర్శులు వరలక్ష్మి, రంగశ్రీలతో పాటు మంజు, శైలజ, సరిత, కల్యాణి, రాజి, విష్ణుమారుతి పాల్గొన్నారు.

గాలిపటాల పంపిణీ

సుల్తాన్‌బజార్: సంక్రాంతి పండుగ ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తుందని జాంబాగ్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. శనివారం మాలకుంటలో చిన్నారులకు గాలిపటాల పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అమర్‌సింగ్, రఘు, రామకృష్ణ, జగపతి, విశ్వనాథ్‌యాదవ్, భరత్, సందీప్ పాల్గొన్నారు.

జియాగూడలో..

జియాగూడ: జియాగూడలోని దుర్గానగర్‌లో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి ఆధ్వర్యంలో చిన్నారులకు గాలిపటాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్ సాగర్, శంభు, అనిత, సురేఖ, గోపాల్ ఉన్నారు.

శ్లోకా స్కూల్‌లో..

జియాగూడలోని శాంతినగర్‌లో గల శ్లోకా ది స్కూల్‌లో శనివారం రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ డైరెక్టర్ రత్నేష్ జైస్వాల్, శైలేందర్ సింగ్ హాజరై గెలుపొందిన వారికి షీల్డ్‌ను బహూకరించారు. ప్రిన్సిపల్ నాగేశ్వర్, డైరెక్టర్ తిరుమలరావు, అన్వేష్, వైస్ ప్రిన్సిపల్ అమితా ఛరణ్ తదితరులు పాల్గొన్నారు.

బల్వీర్ భక్త సమాజ్ ఆధ్వర్యంలో..

నాంపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పిల్లలకు ఉచితంగా పతంగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని శనివారం బల్వీర్ భక్త సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. కాంగ్రెస్ నేత మురళీ మోహన్ అశోక్ సింగ్ అతిథిగా హాజరై పిల్లలకు పతంగులు, చక్రాలు, దారాలు, మిఠాయిలు పంచిపెట్టారు. రమణ్‌రాజ్ మెహ్రా, గాపాల్‌రావు, రవి, రాజు, షంత్ పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు


పతంగులను పంపిణీ చేస్తున్న మురళీ మోహన్


దుర్గానగర్‌లో..బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి

అనాథలకు అండగా నిలవాలి


అనాథ చిన్నారులకు పిండి వంటకాలు అందజేస్తున్న శంకర్‌యాదవ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: అనాథ చిన్నారులకు ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలని బీజేపీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్, బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాస్ అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు సంక్రాంతి సందర్భంగా పిండి వంటలు అందజేసి సంక్రాతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు తరుణ్ యాదవ్, జెల్లా శ్యామ్ యాదవ్, మహేష్ యాదవ్, సుదీర్ సింగ్, ద్వారాక, లచ్చయ్య, అశోక్ యాదవ్, కట్టా రమేష్ ముదిరాజ్, అర్జున్ యాదవ్ పాల్గొన్నారు.

ఊరెళ్తే సమాచారం ఇవ్వండి


మల్లేష్, ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్

సంతోష్‌నగర్: సంక్రాంతి పండుగకు ఊరు వెళుతున్న ప్రజలు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మల్లేష్ సూచించారు. ఆయన మాట్లాడుతూ..పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఊరు వెళుతున్న ప్రజలు వీలైనంత వరకు ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే 100 టోల్‌ఫ్రీ నంబర్, పోలీసు కంట్రోల్ రూమ్ 87126 62666కు డయల్ చేయాలన్నారు.

ఆకుల హనుమంతరావుకు నివాళి


హనుమంతరావుకు సంతాపం తెలియజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

లంగర్‌హౌస్: నిస్వార్థంగా పార్టీ కోసం పని చేస్తు తనతో పాటు మరెందరికో దారి చూపిన గొప్ప వ్యక్తి ఆకుల హనుమంతరావు అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. జనసంఘ్, బీజేపీ సీనియర్ నాయకులు ఆకుల హనుమంతరావు మృతికి సంతాపం తెలియజేస్తూ ఆయన దినకర్మ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులతో కలిసి తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. భగవంతరావు, అశోక్‌యాదవ్, శంకర్‌యాదవ్, గౌతంజీ, ఉదయ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో యువ సాహిత్య కవులు, రచయితలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత అమ్మంగి వేణుగోపాల్ రచించిన ముఖచిత్రం, కవితాస్వామి రచించిన ముందడుగు పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పలు సామాజిక అంశాలను పుస్తక రూపంలో తీసుకువస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత ఏనుగు నర్సింహారెడ్డి, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి, విశ్రాంత ఆచార్యులు లక్ష్మీనారాయణ, రచయిత్రి తిరునగరి దేవకిదేవి, డాక్టర్ అప్పం పాండయ్య, రామారావు సూర్యప్రకాషరావు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చాంద్రాయణగుట్ట: రేషన్ బియ్యాన్ని (పీడీఎస్) నల్ల బజార్‌కు తరలిస్తున్న ఇద్దరిని ఫలక్‌నుమా పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ గౌస్, షేక్ రహీం అనే ఇద్దరు వ్యక్తులు మినీ లీల్యాండ్ వాహనంలో రేషన్ బియ్యాన్ని ఫలక్‌నుమా మీదుగా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ తన సిబ్బందితో కలిసి వాహనాన్ని ఆపి పరిశీలించగా, 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం అందులో ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు అయూబ్ పరారీలో ఉన్నాడు. స్థానికంగా లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.

జూపార్కును సందర్శించిన విద్యార్థులు



బహదూర్‌పురా: విజ్ఞాన విహారయాత్రలో భాగంగా, సంక్రాంతి పండుగ సెలవు దినాలను పురస్కరించుకొని హిమాయత్‌నగర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నెహ్రూ జూలాజికల్ పార్కును సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం సీపీఎస్ హిమాయత్‌నగర్ కేంద్ర ప్రాథమిక పాఠశాల సామ సునీతారెడ్డి, సంతోషి స్వప్నారెడ్డి, మహేందర్, జమ్లా నాయక్, రాములు విద్యార్థులతో కలిసి సందర్శించారు.

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న హమాలి సంఘం అధ్యక్షుడు ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సంతోషంను హమాలి సంఘం అధ్యక్షుడు, గోషామహల్ నియోకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్ కమిటీ సభ్యులతో కలిసి ఘనంగా సత్కారం చేశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణలో అఫ్జల్‌గంజ్ పోలీసులు వేగవంతంగా స్పందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రఘువీర్‌భాయ్, అంజయ్య, హబీబ్, కర్ణా, ఆకాష్, మహేష్ పాల్గొన్నారు.

‘ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించొద్దు’


ట్రాఫిక్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఫుట్‌పాత్ వ్యాపారులను వేధించొద్దని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టూంబ్స్ రోడ్-షేక్‌పేట్ నాలా రోడ్డుకు వచ్చే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో సైతం తోపుడు బండ్ల వ్యాపారులను, ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేసుకునే వారిని ట్రాఫిక్ పోలీసులు చలాన్‌లు వేస్తున్నారని, దీన్ని వల్ల చిరువ్యాపారులపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. ప్రజల ఫిర్యాదుల మేరకే తాము ఫుట్‌పాత్‌లపై, రోడ్లపై వ్యాపారాలు చేసే వారికి హెచ్చరిస్తున్నామని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు ఎమ్మెల్యేకు వివరించారు. యూటర్న్‌లు, రోడ్లపై అక్రమ వాహనాల పార్కింగ్ విషయాలపై తమకు ప్రతినిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. ఏదేమైనా ఫుట్‌పాత్ వ్యాపారులకు చలాన్‌లు వేయడం మానుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ స్పష్టం చేశారు. చిరువ్యాపారులైన పేద వారిపై చలాన్‌లు వేయడం సబబుకాదని ఆయన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు.

సీబీఐ విచారణ జరిపించాలని ధర్నా


ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మాల మాదిగల సంఘాల ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: దళిత బంధు పేరుతో దళితుల సొమ్మును దోచుకున్న బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులపై సీబీఐ విచారణ జరిపించాలని మాల మాదిగ జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, ఎమ్మార్పీఎస్ కేఎస్.బాబు, వర్గం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు దళితులు ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వం రూ.12 లక్షల అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని కోరారు. దళితుల దగ్గర డబ్బులు వసూలు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జంబుల అరుణ, శంకర్, శివలింగం, రమేష్, సుమన్‌కుమార్, నరేందర్, దర్శన్, అమరేందర్ పాల్గొన్నారు.

‘మాజీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటాం’


మాట్లాడుతున్న తిరుపతి శివ కుమార్ తదితరులు

గౌలిపురా: పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా చెలామణి అవుతున్న మాజీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకుంటామని పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివకుమార్ అన్నారు. శనివారం హనుమాన్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి శివకుమార్ మాట్లాడారు. పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా తనను అధికారికంగా నియమిస్తూ రిజిస్టర్ ఆఫ్ సొసైటీస్ శాఖ వారు సర్టిఫికెట్‌ను జారీ చేశారన్నారు. అనేక ఏళ్లుగా అధ్యక్ష పదవీని అనుభవించిన ఓ మాజీ అధ్యక్షుడు నూతన కమిటీ అధ్యక్షుడిగా తిరుపతి శివకుమార్‌ను ఎన్నుకున్న తర్వాత కూడా మాజీ అధ్యక్షుడు నిబంధనలను ఉల్లంఘించి తన ఇంట్లోని ఓ గదిని కార్యాలయంగా మార్చి దొడ్డి దారిన తనకు తాను అధ్యక్షుడిగా చెలామణి అవుతున్నాడన్నారు. ఇకపై సదరు మాజీ అధ్యక్షుడు, అతని అనుచరులు సంఘం పేరును వాడుకున్నా.. లోగోను, రిజిస్ట్రేషన్ నంబర్ (8759/2000)ను ఉపయోగించినా.. పాతనగరం మున్నూరు కాపు సంఘం పేరిట ప్రకటనలు విడుదల చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మర్రి చెన్నారెడ్డి సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న కావూరి వెంకటేష్, వినోద్ చౌగ్లే


నివాళులర్పిస్తున్న మనిలాల్ షా, రాజేందర్ యాదవ్

జియాగూడ: మర్రి చెన్నారెడ్డి రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కావూరి వెంకటేష్ అన్నారు. శనివారం జియాగూడలో పార్టీ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు నర్మద, నవీన్ కుమార్, ఆనంద్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మర్రి చెన్నారెడ్డి జయంతి

అబిడ్స్: మాజీ దివంగత ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన చిత్రపటానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మనిలాల్‌షా, ప్రేమలత అగర్వాల్, నర్సింగ్‌రావు, రాజేందర్ యాదవ్, ఓంప్రకాష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



అబిడ్స్: ఎంజేమార్కెట్‌లోని కేర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఓ మహిళా పేషంట్‌కు వ్యాల్యూ స్ప్రెరింగ్ ఆరోటిక్ రూట్ రిప్లేస్‌మెంట్ సర్జరి నిర్వహించారు. ఆస్పత్రి చీఫ్ కార్డియోథెరపి సర్జన్ డాక్టర్ కేవీ.రాజశేఖర్‌రావు ఆధ్వర్యంలో ఈ అధునాతన శస్త్ర చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..76 ఏళ్ల రంగు సుబ్బమ్మకు కార్డిక్ విభాగంలో వినూత్న తరహా డేవిడ్స్ ప్రొసీసర్‌లో సర్జరీ చేశామన్నారు. తమ ఆస్పత్రిలో అత్యాధునిక టెక్నాలజీతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. కార్డియాలజీ విభాగంలో డేవిడ్స్ ప్రొసీసర్‌లో శస్త్ర చికిత్సలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

సన్మానం


సయ్యద్ రఫత్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: నిస్వార్థ సేవలకు ప్రజల గుర్తింపు ఉంటుందని ప్రముఖ ఫొటో గ్రాఫర్ అబ్బాస్ హుస్సేన్ అన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కార్యాలయంలో పని చేసే సయ్యద్ రఫత్ హుస్సేన్‌ను శనివారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి సయ్యద్ రఫత్‌హుస్సేన్ సరైన సలహాలు, సూచనలు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్, జబ్బార్, రఫీక్, అన్వర్ తదితరులున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



గన్‌ఫౌండ్రీ: కులమతాలకు అతీతంగా దేశ ప్రజలను ఐక్యంగా ముందుకు నడిపించడంలో హిందీ భాష ప్రముఖ పాత్ర పోషిస్తుందని హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి అన్నారు. శనివారం నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని హిందీ ప్రచార సభ కార్యాలయంలో హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రపంచంలో అత్యాధికంగా మాట్లాడే భాషలల్లో హిందీ రెండవ స్థానంలో ఉందని తెలిపారు. మిలింద్ ప్రకాష్ సంస్థ అధినేత శృతి కాంత్ భారతి, ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ సంయుక్త కార్యదర్శి హాజీవల్లి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు పట్టుదలతో భవిష్యత్తు ప్రణాళికలకు కృషి చేస్తే విజయం అదే వరిస్తుందని సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్ర అన్నారు. శనివారం గన్‌ఫౌండ్రీలోని రోజరికాన్వెన్ట్ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా బాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జాతీయ చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శిక్షణా సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వప్న, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ లేడీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ రీతూషా, రోజరీ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ అన్నామేరి, ప్రధానోపాధ్యాయురాలు కొమ్మారెడ్డి జోఫిన్ పాల్గొన్నారు.

పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో ‘లోహరి మేళా’


మాట్లాడుతున్న నిర్వాహకులు

అబిడ్స్: పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 14న లోహరి మేళా వేడుకలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ సునిల్‌పురి వినత్ ఆరోరా, డి.ఎస్.గౌరి, ఉమేష్ తక్రా పేర్కొన్నారు. అబిడ్స్‌లోని రాఘవరత్న టవర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..సంక్రాంతి సంబరాల వేడుకల సందర్భంగా లోహరి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 14న ఎస్‌డీ.రోడ్డులోని మహబూబ్ కాలేజీలో వేడుకలు చేపడుతామన్నారు. పంజాబి సంస్కృతి సంప్రదాయాలు చాటే విధంగా వేడుకలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, నవీన్‌కుమార్, దీపక్‌కుమార్, గురువేందర్ సైని, ప్రీతా ఆరోరా, నంద మలహోత్రా, గజల్, అమిత్ సచ్‌దేవా పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో యువజన దినోత్సవం


విజేతలతో అధ్యాపక బృందం

గోల్కొండ: విద్యార్థులకు స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకమని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి విభాగం ఇన్‌చార్జి డాక్టర్ పల్లె అపర్ణ అన్నారు. శనివారం కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకోని ఆరంభ్ పేరిట యువజన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు స్వామి వివేకానంద ఒక నిలువు నిదర్శనమన్నారు. డాక్టర్ మాధవీలత, ఆరంభ్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ నీలి రమేష్, వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవం



గోల్కొండ: సరస్వతీ శిశుమందిర్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిగా ఎదుగుతారని సరస్వతీ విద్యాపీఠం కార్యనిర్వహక కార్యదర్శి, పూర్వ విద్యార్థి హరిస్మరణ్‌రెడ్డి అన్నారు. శనివారం కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ భావాలతో పాటు హిందూ సంస్కృతి ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పతకమూరి శ్రీనివాసరావు, వజ్రలింగం, వెంకటేశ్వర్లు, గంగాధర్, పరమానంద బన్సల్, ప్రధానోపాధ్యాయులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం


మహ్మద్ అమేర్


ఆస్మా ఖతూన్


మహ్మద్ అబ్దుల్లా

డబీర్‌పురా: యువకుడు అదృశ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. కాలడేరా గుల్జార్ మసీదు ప్రాంతానికి చెందిన సాబేరా బేగం, అబుబాకర్‌ల కుమారుడు మహ్మద్ అమేర్ (18) నాలుగేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 7న మహ్మద్ అమేర్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. తన కుమారుడు కనిపించడం లేదని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో..

గృహిణి అదృశ్యమైన ఘటన రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాకుత్‌పురా నాగబౌలి సిద్దిఖీ మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ ఐజాజ్ అలీ ఖాన్ కూతురు ఆస్మా ఖతూన్ (42) గత నెల 30న సాయంత్రం 4 గంటల సమయంలో నాంపల్లిలోని యూసుఫియన్ దర్గాకని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు దర్గా పరిసరాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కూతురు కనిపించడం లేదని ఐజాజ్ అలీ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్లా (46)కు తన భార్యతో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 1న భార్య తన కుమారుడితో కలిసి మహారాష్ట్రలో సోదరి వివాహానికి వెళ్లింది. మహ్మద్ అబ్దుల్లా ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. అనంతరం ఈనెల 8న తిరిగి ఇంటికి చేరుకున్న భార్యకు తన భర్త ఇంట్లో కనిపించలేదు. ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.